## విద్యార్థులకు పఠన పోటీలు



ముత్తంపేటలో పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల, జనవరి 22: మండలంలోని ముత్తంపేట కాంప్లెక్స్ పరిధిలోని 10 పాఠశాలల విద్యార్థులకు సోమవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం గావుడే హన్మంతు ఆధ్వర్యంలో పఠన పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ఎంపీపీఎస్ శీర్షా పాఠశాల నుంచి డీ స్రవంతి ఎంపికైనట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతగా ఎండీ రయిజ్ అహ్మద్ వ్యవహరించినట్లు పేర్కొన్నారు. స్రవంతిని జిల్లా పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ గంధం ప్రకాశ్ ఉన్నారు.

## ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి

రెబ్బెన, జనవరి 22: వచ్చే నెలలో జరిగే గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్‌కు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు సూచించారు. రెబ్బెన మండల కేంద్రం నుంచి గంగాపూర్ జాతరకు వెళ్లే దారులు, గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం పరిసరాలు, వాగులను సోమవారం పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందించారు. జాతర విజయవంతానికి అందరూ కృషి చేయాలని కోరారు. రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్, ఈవో బాపురెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, నాయకులు ఉన్నారు.

## యువతి అదృశ్యం

దహెగాం, జనవరి 22: మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన దిగిడ లావణ్య కొద్ది రోజులుగా కనిపించడం లేదని ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు. దిగిడ శంకరయ్య పెద్దకూతురు లావణ్య ఈనెల 18న మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లిందని, సాయంత్రం వరకు కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ నాయకులు

సిర్పూర్(యూ)జనవరి 22: మండలంలోని పన్గాడిగూడలో మంగళవారం నిర్వహించనున్న శ్రీ జోరమ్మ తల్లి అవ్వాల్‌పేన్ పూజా మహోత్సవానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆహ్వానించినట్లు అవ్వాల్ పేన్ ఆలయ కమిటీ నిర్వాహకులు తోడసం గుణవంతరావు, ఎంపీటీసీ కుడ్మెత యశ్వంత్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోడసం ధర్మారావు తెలిపారు. దీంతో పాటు అవ్వాల్ పేన్ కటోడా తోడసం మారు జ్ఞాపకార్థం క్రీడా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. విజయవంతానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు

## గ్రామ పంచాయతీ అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక

రెబ్బెన, జనవరి 22: నవేగాం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని గ్రామసభ నిర్వహించామని సర్పంచ్ వడై మాధవి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారుతి పాల్గొన్నారు.



దహెగాంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



ఆసిఫాబాద్‌లో హాజరైన భక్తజనం



ఆలయం వద్ద భక్తులు

# ఊరూరా రామనామం..

- కిటకిటలాడిన ఆలయాలు
- పూజలు, అన్నదానాలు

అయోధ్యంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మంచిర్యాల జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆసిఫాబాద్, సిర్పూర్(యు), రెబ్బెన, కెరమెరి, కౌటాల, చింతలమానేపల్లి, దహెగాం, బెజ్జూర్, మండలాల్లోని రామాలయాలు, హనుమాన్ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చారు. ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామాలన్నీ రామ నామ స్మరణతో మార్మోగాయి. పలు చోట్ల హనుమాన్ చాలీసా పఠించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అయోధ్యలో బాల రామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. సా యంత్రం భజనలు నిర్వహించారు. ఎస్పీ సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తిర్యాణి మండలంలోని ఏదులపాడ్ గ్రామానికి చెందిన ఆత్రం సచిన్ అయోధ్య రామ మందిర దర్శన యాత్రను సైకిల్ ద్వారా ప్రారంభించాడు. ముందుగా ఏదులపాడ్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశాడు.

-నెట్ వర్క్



కాగజ్‌నగర్‌లో శోభాయాత్రలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు



కెరమెరిలో..



తిర్యాణిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

# గంగాపూర్ జాతర ఘనంగా నిర్వహించాలి

**★ కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

రెబ్బెన, జనవరి 22 : గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఇబ్బందుల్లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. సోమవారం గంగాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని ఏర్పాట్లపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు. గంగాపూర్‌కు వచ్చే దారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని, దారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలని, వాగులో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్, రెబ్బెన తహసీల్దార్ సమీర్, ఎంపీవో అంజాద్‌పాషా, ఈవో బాపురెడ్డి, ఆర్ఐ ప్రేమ్ కుమార్, కార్యదర్శి మురళీధర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బీఆర్ఎస్ నాయకుడు పందిర్ల మధునయ్య ఉన్నారు.

### ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

ఆసిఫాబాద్, జనవరి 22 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణులతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అధికారులు సమన్వయంతో వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అటవీశాఖ చెక్ పోస్ట్ సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాద స్థలాన్ని సోమవారం ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. రాంగ్ రూట్‌లను వెంటనే మూసివేయాలని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. వన్‌వే వద్ద పోలీస్ సిబ్బంది ఉండి వాహనదారులకు సూచనలు అందిస్తారన్నారు. శివాజీ భవనం వద్ద వన్‌వే ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లపై పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.

NT-319418-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

## విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

బెజ్జూర్, జనవరి 22 : మండల కేంద్రంలో ఈ నెల 24న బుధవారం కుమ్రం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆదివాసీ జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి కోర్తె తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యకరమానికి మండలంలోని ఆదివాసులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తొర్రెం బాణయ్య, వెంకట్ రావు, తలండి రాము, తలండి మదునయ్య, పాల్గొన్నారు.

## క్యాలెండర్ అవిష్కరణ



క్యాలెండర్‌ను అవిష్కరిస్తున్న డీఐఈవో నైతం శంకర్, లెక్చరర్లు

ఆసిఫాబాద్, జనవరి 22: గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం క్యాలెండర్‌ను సోమవారం డీఐఈవో నైతం శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్య బలోపేతానికి జూనియర్ లెక్చరర్ల కృషి ఎంతో అవసరం అన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రయ్య, సంఘం నాయకులు బాల కృష్ణ, సంతోష్, రాజమౌళి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన, జనవరి 22: మండలంలోని పుంజుమేరగూడ గ్రామంలో సోమవారం హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించినట్లు గ్రామపెద్దలు తెలిపారు. గ్రామానికి చెందిన పుంజుమేర భూమిని దానం చేయగా గ్రామస్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ ఆలయ నిర్మాణం పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వడై గణపతి, విస్సయ్య, కాంతారావు, వడై నగేశ్, మోర్ల నర్సింహా, వడై రాంచందర్, కాంగ్రెస్ నాయకులు లావుడ్య రమేశ్, దుర్గం దేవాజీ, మోడెం సుదర్శన్‌గౌడ్, మోడెం చిరంజీవిగౌడ్, అవిడపు గోపి, గోగర్ల రాజేశ్, మోడెం రాజేంద్రప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు బోమ్మినేని శ్రీధర్, వస్రంనాయక్ పలువురు ఉన్నారు.

## అన్నదానం

కౌటాల, జనవరి 22: శ్రీ సత్యసాయి సేవా సమితి కౌటాల, ముత్తంపేట, మొగఢ్‌దగఢ్ సమితి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో అన్నదానం చేశారు. ముందుగా సత్యసాయి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. కౌటాల, ముత్తంపేట, మొగఢ్‌దగఢ్ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# జ్యోతిబాపూలే విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

వాంకిడి, జనవరి 22: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకొని పూలాజీ బాబా మార్గంలో నడవాలని ఆసిఫాబాద్ ఎమ్మె ల్యే కోవ లక్ష్మి సూచించారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని తేజిగూడ గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహ ప్రతిష్టాపనకు సోమవారం ఆమె హాజరై భూమి పూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పెంటయ్య, సరాండి సర్పంచ్ దుర్గం కమలాకర్, గ్రామపటేల్ రాంచందర్, మాలిసంగ జిల్లా అధ్యక్షుడులు నాగోసే శంకర్, ఎస్ఐ సాగర్, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

### సంస్కృతిని కాపాడుకోవాలి..: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, జనవరి 22: అంతరించిపోతున్న కళలు, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామంలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మూడు రోజుల పాటు చిరుతల రామాయణం నిర్వహించి సోమవారం హోమం, అన్నదానం ఏర్పాటు చేయగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శాలువాతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



విద్యార్థిని అభినందిస్తున్న గోనె శ్యాంసుందర్ రావు

## గణతంత్ర దినోత్సవాలకు విద్యార్థి

మంచిర్యాల అర్బన్, జనవరి 22 : గణతంత్ర దినోత్సవం సం దర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న పరేడ్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి క్రీడాకారిణి తు మ్రామ్ సత్యభామకు ఆహ్వానం అందినట్లు ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నాయకులు సోమ వారం తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు మాట్లాడుతూ సత్యభామకు రిపబ్లిక్ డే కార్యక్రమానికి ఆహ్వానం రావడం గర్వకార ణమన్నారు.కోచ్ సునార్కర్ అరవింద్‌ను ఈ సందర్భంగా అ భినందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కో శాధికారి అలుగువెల్లి రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకర్ ఢీకొని కారు బోల్తా

కాసిపేట, జనవరి 22 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో కారు బోల్తా పడడంతో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. కాసిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన మైస రమ్యకృష్ణ, భర్త రమేశ్, పగిడి మాధవి, మరో ఏడేళ్ల చిన్నారితో కలిసి కారులో మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమగూడెం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై హైవే పనులు నిర్వహించే కంపెనీకి చెందిన ట్యాంకర్ ఓవర్ టేక్ చేయబోతూ కారును ఢీకొంది. కారు సుమారు 50 మీటర్లు పైకి లేచి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న మైస రమ్యకృష్ణకు చెయ్యి విరిగి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగారం తెలిపారు.



క్షతగాత్రులను తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

## జంగుబాయి వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం



పోస్టర్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

కెరమెరి, జనవరి 22: ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి మహాపూజకు ఈ నెల25న హాజరవ్వాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావును ఎంపీపీ పెందోర్ మోతీరాం ఆహ్వానించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మహాపూజ పోస్టర్‌ను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్వో సురేశ్, ఎంపీపీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కుమ్రం నాణేశ్వ ర్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భారత్ భూషణ్, మండలాధ్యక్షుడు సెడ్మాకి తుకారాం ఉన్నారు.

## సమస్యలు పరిష్కారించాలని మంత్రులకు వినతి

కాసిపేట, జనవరి 22 : సర్పంచుల సమస్య లను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కను కాసిపేట మండలంలోని సోమగూడెం(కే) సర్పంచ్, మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు సపాట్ శంకర్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాల యంలో వారిని జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సంతోష్‌తో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సన్మానించారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. సర్పంచ్‌ల ఎన్నికలు జరిగే వరకు ఇన్‌చార్జిలుగా తమనే కొనసాగించాలని కోరారు. దీనిపై వారు సాను కూలంగా స్పందించారని శంకర్ తెలిపారు.

## గ్రామ సభ

కాసిపేట, జనవరి 22 : మండలంలోని సోమగూడెం (కే) గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ కనుకుల రాకేశ్ అధ్యక్షతన గ్రామ అభివృద్ధి ప్రణాళిక గ్రామ సభ నిర్వహించారు. కార్యదర్శి కొండగొర్ల కీర్తి, వార్డు సభ్యులు సపాట్ మల్లేశ్, మల్యాల స్రవంతి, బూడిద రోజా, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టెండాల్ ఎంపిక పరీక్షలు

శ్రీరాంపూర్, జనవరి 22: ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో అంతర్గత టెండా ల్, టెండాల్ సూపర్‌వైజర్, బిట్ షార్ప్‌నర్, కార్పెంటర్ల భర్తీకి సోమవారం వర్క్‌షాప్‌లో కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎస్‌వోటూజీఎం రఘుకుమార్, డీవైజీఎం అరవిందరావు, చిరంజీవులు, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అభ్యర్థులకు మౌఖిక ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ అంతర్గత ఖాళీల భర్తీకి, అత్యంత పారదర్శకంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏజెంట్ గోపాల్‌సింగ్, వర్క్‌షాప్ ఇన్‌చార్జి మల్లయ్య, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

రెబ్బెన, జనవరి 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఖైర్‌గాం గ్రామంలో గల ఫ్లైఓవర్‌పై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న బోర్‌వెల్ లారీ ఖైర్‌గాం గ్రామం వద్ద గల ఫ్లైఓవర్‌పై అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. అందులో ఉన్న దీరన్ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ చిత్రు, లాల్‌చంద్, సమీర్‌లాల్, అరవింద్, అనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చిత్రు, అరవింద్, అనంద్‌ను బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు, లాల్‌చంద్, సమీర్‌లాల్‌ను ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.